సాక్షి చిత్తూరు

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023

I



భక్తజనసంద్రంగా బోయకొండ

బోయకొండ శ్రీగంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఉదయం నుంచి రద్దీ సాగింది. - IIలో



కలాన్ని కదిలిద్దాం రండి

ఉత్తరాన్ని గుర్తు చేసేందుకు..అవగాహన పెంచేందుకు లేఖరులకు పోస్టల్ శాఖ పోటీ పెడుతోంది. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	25
తిరుపతి	34	26
తిరుమల	29	22
గూడూరు	36	28
నగరి	34	26

న్యూస్‌రీల్

గణనాథుని దర్శనానికి 5 గంటలు



క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారాలు సెలవు రోజులు రావడంతో స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కంపార్ట్‌మెంట్‌లు, క్యూలు నిండిపోయి ఆలయం వెలుపలి వరకు భక్తులు బారులు తీరారు. స్వామివారి దర్శనానికి 5 గంటల సమయం పట్టింది. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా, త్వరితగతిన దర్శనం చేసుకునేలా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, దివ్యాంగులను ప్రత్యేక క్యూల్లో దర్శనానికి అనుమతించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ప్రజలు సమస్యలను వినతులు రూపంలో తెలియజేయాలన్నారు. స్పందనలో నమోదయ్యే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన జరుగుతుందని తెలిపారు. ఆయా శాఖల అధికారులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడ వచ్చని పేర్కొన్నారు.

ష్..గప్‌చుప్

- అధినేత అరెస్టును పట్టించుకోని టీడీపీ కేడర్
- బాబు సొంత జిల్లాలో టీడీపీ డీలా
- వీధుల్లోకి రావాలని నేతల హుకుం బేఖాతర్
- ఒకటి రెండు చోట్ల నామమాత్ర నిరసన



స్కిల్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో సొంత జిల్లా చిత్తూరులో టీడీపీ క్యాడర్‌లో నిశ్శబ్దం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో ఎలాంటి స్పందన కనిపించ లేదు. మొదటి రోజు బెయిల్ వస్తుందంటూ హడావుడి చేశారు. రెండోరోజు ఆదివారం పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేయాలని పార్టీ హై కమాండ్ పదేపదే హెచ్చరించినా.. బలవంతం చేసినా పార్టీ నేతలు, కార్యకర్తలు ముఖం చాటేశారు. ఒకటి రెండు చోట్ల నామమాత్రపు కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబుకు మద్దతుగా పెద్ద ఎత్తున జనాన్ని సమీకరించి నిరసనలు తెలపాలని రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రాధేయపడే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం ఆ పార్టీ దీనస్థితిని తేటతెల్లం చేసింది. - సాక్షి, చిత్తూరు

చట్టానికి ఎవరూ అతీతులు కారు



చట్టానికి ఎవరూ అతీతులు కాదు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుకు రిమాండ్ విధించడంపై అందరికీ గౌరవం పెరిగింది. ఒక మంచి సందేశం ప్రజల్లోకి వెళ్లింది. ఎన్నో స్కాంలు చేసిన చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తప్పించుకుంటూ వచ్చారు. నేడు ఆ పాపాలు పండాయి. సామాన్య ప్రజలు సంతోషిస్తున్నారు. ప్రజల కోసం అరెస్ట్ అయ్యాడని ఆయన సతీమణి భువనేశ్వరి చెప్పడం విడ్డూరంగా ఉంది. ఎన్టీఆర్ ఆత్మ నేడు సంతోషి స్తోంది. ఎన్టీఆర్ అభిమానులు నేడు సంతోషిస్తున్నారు. దత్త పుత్రుడి ఓవర్ యాక్షన్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

- మంత్రి ఆర్‌కే రోజా

ఇంకా జనాన్ని మోసం చేస్తారా..



స్కిల్ స్కామ్ జరిగింది వాస్తవమని అన్ని ఆధారాలున్నాయి. ఇది కరెక్ట్‌కాదని ఆర్థికశాఖ కొర్రి పెడితే నిధులు విడుదల చేయాలని సీఎం హోదాలో చంద్రబాబే చెప్పినట్లు కోర్టుకు సాక్ష్యం చూపారు. ఢిల్లీనుంచి న్యాయవాద బృందాన్ని పిలిపించినా న్యాయమే గెలిచింది. అన్నీ తెలిసి కూడా ఇంకా జనాన్ని ఏమార్చేందుకు చంద్రబాబు ప్రయత్నించడం కరెక్ట్ కాదు.

- శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్


మరిన్ని కుంభకోణాలు బయటపడుతాయి



చంద్రబాబు స్కిల్ స్కామ్ విషయంలో న్యాయమే గెలిచింది. నలభై ఏళ్లుగా అవినీతికి పాల్పడుతూ, వ్యవస్థలను మెనేజ్ చేస్తూ తప్పించుకుంటున్నారు. అవినీతి ఎవరు చేసినా చట్టాలకు అతీతులు కారు. ఆయన హయాంలో చేపట్టిన అనేక పనులను విచారిస్తే మరిన్ని కుంభకోణాలు బయటపడతాయి. కుప్పంలోను ఇదే జరిగింది. ఇజ్రాయిల్ టెక్నాలజీ వంటి ప్రాజెక్టులపై విచారణ చేస్తే మరింత అవినీతి బయటపడుతుంది. బాబు హయాంలో కుప్పంలో జరిగిన పనులపై కూడా విచారణ చేపట్టాలి.

- భరత్, ఎమ్మెల్సీ

తప్పు చేయకుంటే భయమెందుకు?



వ్యవస్థలను మేనేజ్ చేయడం, మీడియాను వాడుకోవడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఏ కేసు వచ్చినా స్టేలతో తప్పించుకునేవారు. స్కిల్ స్కామ్‌లో ఆధారాలతో అడ్డంగా దొరికిపోయారు. చంద్రబాబును రిమాండ్‌కు ఆదేశిస్తే సాధారణ ప్రజలు సైతం ఆనందపడుతున్నారు. ఆయన తప్పు చేయకుంటే ఎందుకు భయం. చట్టానికి అందరూ సమానులే.

- వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

నిజాయితీని నిరూపించుకోవాలి



స్కిల్ కుంభకోణంలో సీఐడీ ఇచ్చిన వివరణలు చూస్తుంటే బాబు హస్తం ఉన్నట్లు అర్థమవుతోంది. సాక్ష్యాలన్నీ పక్కాగా ఉన్నట్టు పోలీసుశాఖ చెబుతోంది. తాను ఏ తప్పు చేయకుంటే, నిర్దోషిత్వాన్ని స్టేలు తెచ్చుకోకుండా కేసు విచారణకు బాబు సహకరించాలి. తప్పు ఎవరు చేసినా శిక్ష తప్పదు.

- కృష్ణకుమార్, న్యాయవాది, చిత్తూరు

చట్టం ముందు అందరూ ఒక్కటే



తాను నిప్పు అని గొంతుచించుకునే చంద్రబాబు నాయుడు అదే మాటపై నిలబడాలి. స్కిల్ స్కామ్‌లో రూ.వందల కోట్ల అవినీతి జరిగింది సుస్పష్టం. ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేకున్నా.. తాను అంటించుకున్న బురదను ప్రభుత్వంపై చల్లాలని చూడడం హాస్యాస్పదం. లోకేష్ అవినీతిని కూడా బయటకుతీసి విచారణ చేపట్టాలి. తప్పుచేస్తే చట్టం ముందు అందరూ ఒక్కటే. భావితరాలకు, యువతకు శిక్షణ ఇస్తామని పెట్టిన సంస్థ ద్వారా కోట్లు వెనకేసుకున్న చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో కొనసాగే నైతికత కోల్పోయారు.

- ఎంసీ.విజయానందరెడ్డి, వైస్‌చైర్మన్, ఏపీఎస్ ఆర్టీసీ

న్యాయం గెలిచింది



స్కిల్ కుంభకోణం తీర్పులో న్యాయం గెలిచింది. రూ.వందల కోట్ల నిధులు స్వాహా చేసి, సుప్రీంకోర్టు నుంచి ఖరీదైన న్యాయవాద బృందాన్ని పిలిపించి కేసును తప్పుదోవ పట్టించాలనుకున్నారు. పక్కా ఆధారాలు ఉండడంతో కోర్టు రిమాండ్‌కు ఆదేశించింది. ఎప్పుడైనా న్యాయమే గెలుస్తుంది. అధినేత అరెస్టును టీడీపీ శ్రేణులే పట్టించుకోవడం లేదు. - ఎంఎస్ బాబు, ఎమ్మెల్యే, పూతలపట్టు

తప్పు చేస్తే శిక్ష తప్పదు



తప్పు చేస్తే శిక్ష ఎప్పటికైనా అనుభవించాల్సిందే. చంద్రబాబుకు ఆ సమయం ఇప్పుడు వచ్చింది. మామ ఎన్టీఆర్‌తో పాటు పలువురిని తన అవసరాలకు వాడుకుని మోసం చేసిన ఘనత బాబుది. మలిదశలో మరిన్ని కుంభకోణాలకు సంబంధించి శిక్షలు అనుభవించడం కూడా తథ్యం. ఎప్పుడూ స్టేలు తెచ్చుకునే ఆయనకు చట్టం తగిన బుద్ధి చెప్పింది.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే, చిత్తూరు

భక్తజనసంద్రంగా బోయకొండ


విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లి: కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల పాలిట ఆరాధ్య దైవంగా పేరొందిన బోయకొండ శ్రీగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిరావడంతో క్యూలన్నీ నిండిపోయాయి. ఉదయం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దివ్వెలతో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ఇఓ చంద్రమౌళి పర్యవేక్షణలో తీర్థప్రసాదాలను అందజేశారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

పౌష్టికాహార లోపంతో మాతాశిశు మరణాలు

చిత్తూరు రూరల్: పౌష్టికాహార లోపంతోనే మాతాశిశు మరణాలు సంభవిస్తున్నాయని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ రాజేష్ తెలిపారు. చిత్తూరు మురకంబట్టులోని అపోలో మెడికల్ కాలేజీలో ఆదివారం ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో నియోనేటల్ రెస్యూ్యటేషన్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మాతా శిశుమరణాలు పెరుగుతున్నాయన్నారు. పౌష్టికాహార లోపంతో దీన్ని అధిగమించవచ్చని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జయంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలాన్ని కదిలిద్దాం రండి..!

- లేఖా రచనకు పోస్టల్ శాఖ ప్రోత్సాహం
- విజేతలకు బహుమతులు
- విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా చర్యలు


చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: చాలకాలం క్రితం పోస్ట్ అనే పిలుపు కోసం ఎదురుచూసిన క్షణాలు గుర్తున్నాయా..అభిమాన లేఖలు సమాచారం మోసుకొచ్చిన ఉత్తరాలు అందుకుని అపురూపంగా చదువుకొని ఎన్నాళ్లయిందో..మనసులోని భావాలను కాగితంపై పెట్టి అందమైన దస్తూరితో అవతలి వారికి చేరవేయడం ఈ తరం వారికి తెలీనే తెలీదు. సెల్‌ఫోన్ మేసేజ్‌లు, ఈ-మెయిళ్లు, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం నేటి ట్రెండ్. అందుకే ఉత్తరాన్ని ఓ సారి గుర్తు చేద్దామని తపలాశాఖ తలపెట్టింది. లేఖరులకు పోటీ పెడుతోంది. ఇంకెందుకు ఆలస్యం కలం కదిలించండి. విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పించడానికి తపాలాశాఖ అడుగులు వేస్తోంది.

డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా
ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్నవారి క్షేమ సమాచారం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు పెన్ను పేపర్ తీసుకొని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదు. మొబైల్ ఫోన్ ద్వారా సమాచారాన్ని క్షణాల్లో వీడియో, వాయిస్‌కాల్స్ ద్వారా మాట్లాడుకునే సదుపాయం ఉంది. విదేశాల్లో ఉన్న వారు సైతం వీడియో కాల్ ద్వారా మాట్లాడే అవకాశం ఉంది. లేఖల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలను మరిచిపోయారు. ఒకప్పటి సమాచార సాధనాన్ని నేటి యువతరానికి గుర్తు చేసేందుకు తపాలాశాఖ లేఖారచన పోటీలకు శ్రీకారం చుట్టింది. 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశం పై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ధాయి ఆఖర్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

ఎవరు పాల్గొనవచ్చంటే
భారతదేశ పౌరులెవరైనా ఈ పోటీలో పాల్గొన్నవచ్చు. ఎలాంటి వయోపరిమితి లేదు. 18 ఏళ్ల లోపు వారిని ఒక కేటగిరిగా, 18 ఏళ్ల పైబడిన వారిని మరో కేటగిరీగా పరిగణిస్తారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను అందులో పొందుపరచ్చాలి. ఏ4 సైజు ఉంచి పంపిచవచ్చు. లేదా ఇన్‌లాండ్ లెటర్ ద్వారా కూడ పంపవచ్చు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ సాధనాల్లో టైప్ చేసిన లేఖలను పోటీలకు అనుమతించరు. చేతితో రాసిన వ్యాసం పంపాలి. లేఖలను పంపించేవారు వారి వయసును నిర్ధారిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. పోటీలో గెలిస్తే వారి వయస్సు, ఐడీ ధ్రువీకరణకు అవసరమైన పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలను 'ది చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ-520013' చిరునామాకు అక్టోబరు 31లోగా పంపించాలి.

బహుమతులు: విభాగాల వారీగా రాష్ట్ర జాతీయ స్థాయిల్లో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (12 మంది మించకుండా) నగదు బహుమతులు అందజేయనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు వరుసగా రూ.25 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారి లేఖలను జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ బహుమతి రూ.50 వేలు, రెండోది రూ.25 వేలు, మూడోవ బహుమతికి రూ.10 వేల నగదను అందించనున్నారు.

బహు ప్రయోజనాలు



విద్యార్థులకు ఇటువంటి పోటీ నిర్వహించడం వల్ల ఉత్తరాన్ని పరిచయం చేసినట్లవుతుంది. వారిలో పోటీతత్వం పెరుగుతుంది. డిజిటల్ యుగంలో వారి చేతిరాతతో ఉత్తరాలు రాయడం అంటే చాలా మందికి తెలియదు. ఉత్తరాలు రాసే అలవాటు కూడా పెరుగుతుంది.

-లక్ష్మణ్, సీనియర్ సూపరింటెండెంట్, తపాలాశాఖ



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న గురురాజారావు

పలమనేరు: రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్ల సమస్యల సాధనకు ఐక్య పోరాటాలే మార్గమని రాష్ట్ర పెన్షనర్ల సంఘ ఉపాధ్యక్షులు గురు రాజారావు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పదకొండో వేతన సంఘంలో సంతృప్తికరమైన ఫలితాలను పొందలేకపోయామన్నారు. దీనికి కారణం గత నాలుగేళ్లుగా ఐక్య పోరాటలు లేకనేన్నారు. ఇకనైనా సంఘటిత పోరాటాలకు సిద్ధ కావాలన్నారు. సమావేశంలో సంఘ నేతలు గౌస్, బాలసుబ్రమణ్యం, వీరభద్రగౌడు, చక్రపాణిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు


బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

ఒంగోలు: స్థానిక లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న అండర్-13 బాలబాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 231 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలికల సింగిల్స్ విజేతగా అనంతపురానికి చెందిన డి.వి.యజ్ఞశ్రీ, ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దీపాటి త్రిష్ష నిలిచారు. బాలుర సింగిల్స్‌లో డి.వి.యజ్ఞనాథ్ (అనంతపురం), కె.చద్విక్ (విశాఖ) మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. బాలికల డబుల్స్‌లో అనంతపురానికి చెందిన డి.వి.యజ్ఞ-నెల్లూరుకు చెందిన శ్లోరెడ్డి ప్రథమస్థానంలో నిలిచారు. తూర్పుగోదావరికి చెందిన డి.విజయ తేజస్విని-విశాఖకు చెందిన పి.వేదిక రన్నర్స్‌గా నిలిచారు. బాలుర డబుల్స్ విభాగంలో అనంతపురానికి చెందిన డి.వి.యజ్ఞనాథ్-చిత్తూరుకు చెందిన ఆముదాల ప్రవీణ్ విన్నర్స్‌గా, విశాఖకు చెందిన కె.చద్విక్-కర్నూలుకు చెందిన మహంకాళి జస్వంత్ రన్నర్స్‌గా నిలిచారు. ముగింపు వేడుకలకు కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, డీసీబీ బ్యాంక్ మేనేజర్ ఫణికుమార్, కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ హాజరై విజేతలకు మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేఎస్ లక్ష్మణ్‌రెడ్డి, పి.విజయకృష్ణ, కోశాధికారి అశోక్‌రెడ్డి, రఘుబాబు, సభ్యులు టీవీ రమణ, ఈసీ సభ్యులు కోడె శ్రీనివాస్, రఘుబాబు పాల్గొన్నారు.

బంగారు కొండపై కొలువుదీరిన మల్లేశ్వరస్వామి



నూతనంగా నిర్మించిన మల్లేశ్వరస్వామి ఆలయం, కుంభాభిషేకానికి ఏర్పాట్లు

- నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు
- 13న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టువస్త్రాల సమర్పణ

గుడుపల్లె: మూడు రాష్ట్రాల సరిహద్దులోని ప్రసిద్ధి చెందిన బంగారుకొండపై కొలువు దీరిన శ్రీస్వర్ణగిరి మల్లేశ్వరస్వామి నూతన దేవాలయ విమాన గోపుర కలశ ప్రతిష్ఠ జీర్ణోద్ధరణ, మహాకుంభాభిషేకం నిర్వహణకు సిద్ధమైంది. సరిహద్దు రాష్ట్రాల్లోని భక్తుల ఇలవేల్పుగా మల్లేశ్వర స్వామి పూజలందుకుంటున్నారు. ఈ ఆలయ జీర్ణోద్ధరణ కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులకు 3 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. ఈ నిధులతో నూతనంగా గర్భగుడిని నిర్మించారు. మల్లప్పకొండపై ఆహ్లాదకరమైన వాతావరణం భక్తులను ఇట్టే ఆకర్షిస్తోంది.

నేటి నుంచి..
సోమవారం ఆలయ ఆవరణలో వేదపండితులతో మహాగణపతి పూజ, యాగశాల ప్రవేశం, హోమాలు, కంకణ ధారణ, కలశా స్థాపన, కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ హోమాలతో పాటు ఇతర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.
12వ తేదీ : వేద పారాయణంపాటు రుద్రయజ్ఞం, గోపుర కలశ ప్రతిష్ఠ, పీఠపూజ, రత్ననిక్షేపణ యంత్ర ప్రతిజ్ఞ నిర్వహిస్తారు. అనంతరం హోమాలలో అష్టావధాన సేవ, మహా మంగళహారతి నిర్వహించనున్నారు.
13వ తేదీ : మహాకుంభాభిషేక మహోత్సవం, నూతన విమాన గోపుర కలశ ప్రతిష్ఠ జీర్ణోద్ధరణ, కుంభాభిషేకంలో మహా ప్రాణప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కుంభోద్వాసన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.
బుధవారం : రాష్ట్ర భూగర్భగనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 13న ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవాల్లో పాల్గొననున్నట్లు వైఎస్సార్ సీపీ నేతలు చెప్పారు. ఆయన స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

●ఘనంగా శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపు


వి.కోట : విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

శాంతిపురం: కృష్ణాష్టమి సందర్భంగా శివరామపురంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ పరమాత్మ ప్రతిమను ఆదివారం గ్రామంలో ఊరేగించారు. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిత్య పూజల అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రబోధ సేవాసమితి శివరామపురం కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, సభ్యులు రంగప్ప, బుజ్జప్ప, సుకన్య, రామక్క తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..
వి.కోట: మండలంలోని రామాపురం కృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

కుప్పంలో..


కుప్పంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

కుప్పం రూరల్: కుప్పంలో ఐదు రోజుల శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఊరేగింపుతో ముగిశాయి. ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్యాలెస్ వద్ద శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి ప్రతిమను పురవీధుల్లో కోలాహలంగా ఊరేగించారు. కార్యక్రమంలో ప్రబోధానంద సేవా సమితి సభ్యులు కృష్ణ, నిరంజన్, ప్రకాశ్, కృష్ణారెడ్డి, మంజునాథ్, శరవణ, దేవరాజు, నాగరాజు, శివ, శీను, ఇందిరా, వెంకటలక్ష్మి, యశస్విని, గాయత్రి తదితరులు ఉన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



తిరునావుక్కరసు మృతదేహం, తిరునావుక్కరసు(ఫైల్)

నగరి : నగరి-పుత్తూరు మార్గమధ్యంలో ధర్మాపురం వద్ద శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రుయాలో చికిత్స పొందుతున్న తిరువణ్ణామలై జిల్లా, పోలూరు తాలుకా, ఎల్లుపారై గ్రామానికి చెందిన తిరునావుక్కరసు (22) శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన విషయం విధితమే. ఇప్పటికే ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా, కుమారుడు తిరునావుక్కరసును కూడా విధి దూరం చేయడంతో తట్టుకోలేని వల్లెమ్మ ఆవేదనతో కన్నీటిపర్యంతమైంది. పోస్టుమార్టం అనంతరం బంధువులు తిరునావుక్కరసు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

చిచ్చిలివారిపల్లెలో మహిళ అదృశ్యం


అదృశ్యమైన అనూష

రొంపిచెర్ల: అన్నమ్మయ్య జిల్లా కేవీపల్లె మండలం కొమ్మేపల్లెకు చెందిన వినోద్‌కుమార్ భార్య అనుష రొంపిచెర్ల మండలం చిచ్చిలివారిపల్లెలో అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు .. కొమ్మేపల్లెకు చెందిన వినోద్‌కుమార్, అనూష బెంగళూరులో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రొంపిచెర్ల మండలం చిచ్చిలివారిపల్లె పంచాయతీ కొత్తపల్లెలో ఉన్న చెల్లెలు అనిత ఇంటికి ఈనెల 3న భర్త, ఇద్దరు పిల్లలతో అనూష వచ్చింది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు అనూష అదృశ్యం అయ్యింది. ఆమె కోసం వినోద్ కుమార్ బంధువుల ఇళ్లు, పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. తన భార్య అదృశ్యం వెనుక జిల్లెలమంద కురవపల్లెకు చెందిన శంకర్ హస్తం ఉందని ఆదివారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


రాజ(ఫైల్)


మృతి చెందిన సదాశివశెట్టి

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ దస్తగిరి కథనం మేరకు వివరాలిలా...కొల్లాగుంటకు చెందిన రాజ(51) అదే గ్రామానికి చెందిన తమ సమీప బంధువు చంద్రతో కలసి ద్విచక్ర వాహనంపై సొంత సిమెంట్ బ్రిగ్స్ ఫ్యాక్టరీ వద్దకు బయలుదేరాడు. కొల్లాగుంట సమీపంలో చిత్తూరు వైపు వెళుతున్న కారు అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతోపాటు వాహనం నడుపుతున్న రాజాను సుమారు వంద అడుగుల దూరం వరకు లాక్కెళ్లింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే రాజా మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చంద్రను పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. ఇదే సమయంలో ఎదురుగా ద్విచక్రవాహనంలో వస్తున్న బెంగళూరుకు చెందిన భరత్‌కుమార్‌ను కూడా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కారు డ్రైవర్ నగరి మండలం సోమనాథపురానికి చెందిన శేఖర్ కుమారుడు హరిగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు భార్య మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, రాజాకు ఐదుగురు ఆడపిల్లలు, ఒక్కరికి మాత్రమే వివాహం చేశాడు.

ఈచర్ ఢీకొని..
శ్రీరంగరాజపురం : మండలంలోని దిగువ ముద్దుకుప్పం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఈచర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు కొటార్లపల్లెకు చెందిన కుప్పయ్యశెట్టి కుమారుడు సదాశివశెట్టి (63) పుత్తూరుకు వెళ్లేందుకు వేణుగోపాలపురానికి చెందిన శ్రీనురెడ్డితో కలసి ద్విచక్రవాహనంలో ఆదివారం ఉదయం 6 గంటలకు బయలుదేరాడు. మార్గమధ్యంలో దిగువ ముద్దుకుప్పం క్రాస్ వద్ద వెనుక వైపు నుంచి ఈచర్ వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సదాశివశెట్టిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ షేక్షావలి తెలిపారు. ప్రమాదానికి గురైన ఈచర్ వాహనం ఆగకుండా వెళ్లిపోయిందని పేర్కొన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ..

ఆటో బోల్తా: విద్యార్థి మృతి

పుత్తూరు రూరల్ : మండలంలోని మహాలక్ష్మీపురం వద్ద ఆటో బోల్తాపడిన ప్రమాదంలో శ్రీధర్ అలియాస్ గోకుల్ (13) మృతిచెందాడు. ఎస్ఆర్ పురం మండలం బసివిరెడ్డిపల్లెకు చెందిన మునిరత్నం కుమారుడు శ్రీధర్ 7వ తరగతి చదువుతున్నాడు. అప్పలాయగుంటలో జరిగిన మామ పెళ్లికి హాజరై తన తాత మురుగయ్య ఆటోలో తిరుగుప్రయాణమయ్యాడు. పుత్తూరు బైపాస్‌రోడ్డులో వెళుతుండగా మహాలక్ష్మీపురం వద్ద ఆటో బోల్తాపడడంతో శ్రీధర్ చాతికి, వెన్నుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శ్రీధర్ మృతిచెందాడు. శ్రీధర్ తల్లిదండ్రులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన అందరినీ కలచివేసింది. ఆటోలో ప్రయాణించిన అమ్ములు, వెంకటమ్మకు చేతివేళ్లకు గాయలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి


మృతురాలు పుష్ప(ఫైల్)

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద షాపింగ్‌కాంప్లెక్స్‌లో ఓ మహిళ మృతదేహాన్ని ఆదివారం ఉదయం పారిశుధ్య కార్మికులు గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆరా తీయగా.. పట్టణంలోని బసవన్నకట్టవీధికి చెందిన కళావతమ్మ కుమార్తె పుష్ప(35)గా తేలింది. భర్త వదిలేయడంతో ఇద్దరు పిల్లలతో ఆమె తల్లి ఇంట్లో ఉంటోంది. నిత్యం తాపీ పనులకు వెళ్లే ఆమె శనివారం రాత్రి ఇంటికి రాలేదు. తల్లి పట్టణంలో గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం మృతదేహాన్ని చూసి, శరీరంపై బట్టలు లేకపోవడం, నోట్లో నురగ ఉండడంపై మరణంపై అనుమానం వ్యక్తం చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా అశ్వపూజ



అశ్వపూజ నిర్వహిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీనివాస అష్టోత్తర శతకుండాత్మక మహాశాంతి వరుణయాగంలో భాగంగా ఆదివారం శాస్త్రోక్తంగా అశ్వపూజ జరిపించారు. ఉదయం ఉత్సవమూర్తులను యాగశాలలో వేంచేపు చేసి ఋత్వికులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జేఈఓ వీరబ్రహ్మం యాగశాల నుంచి పూజా సామాగ్రితో అశ్వాల వద్దకు చేరుకున్నారు. తదుపరి వేద మంత్రోచ్చారణల నడుమ అశ్వపూజ చేశారు. సోమవారం నిర్వహించే మహా పూర్ణాహుతితో యాగం పరిపూర్ణం కానుంది. అనంతరం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

గజ బాధితుడికి ఆర్థిక సాయం



కార్తీక్‌కు సాయం అందిస్తున్న నాయకులు

గుడిపాల: మండలంలో పది రోజుల కింద ఏనుగు దాడిలో గాయపడిన బసవాపల్లె దళితవాడకు చెందిన కార్తీక్(25)కు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆదివారం రూ.50 వేలు సాయం చేశారు. రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన కార్తీక్‌కు విజయానందరెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు,కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసుదన్‌రాయల్, ఎంపీటీసీ సభ్యులు గోళ్లహరిప్రసాద్, చిట్టిబాబు ఈ సాయం చేశారు. ఆస్పత్రి ఖర్చులకు సంబంధించి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తామని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అర్జీలు రాసేందుకు ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ సాయంత్రం స్పందన వినతులు స్వీకరించాలని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వరకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 78,557 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 42,083 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.48 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

క్రీడా మైదానాలకు మెరుగైన వసతులు



మైదానాన్ని పరిశీలిస్తున్న శాప్ అధికారులు

నగరి : క్రీడలకు ఎన్నడూ లేనంత ప్రోత్సాహం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లభిస్తోంది. నగరిలోని శాప్ కేవీకే మైదానానికి ఇప్పటికే ఎన్నో వసతులు వచ్చాయి. క్రికెట్ నెట్‌ప్రాక్టీస్, క్రికెట్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్ అంటూ ఆడుకోవడానికి క్రీడాకారులకు వసతులు లభిస్తున్నాయి. ప్రస్తుతం ఖేలో ఇండియా ద్వారా మరిన్ని మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. వీటి నిమిత్తం క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఆమె ఆదేశాల మేరకు విజయవాడ, హైదరాబాద్ నుంచి క్రీడాశాఖ ఉన్నత అధికారులు కేవీకే మైదానానికి విచ్చేశారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న వసతుల ఏర్పాటుకు స్థల సర్వే చేయడంతో పాటు మైదాన అభివృద్ధికి అవసరమైన చర్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా నగరిలోని కేవీకే మైదానాన్ని పరిశీలించిన శాప్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.విజయసాగర్ మాట్లాడుతూ క్రికెట్‌కు రెండు నెట్ ప్రాక్టీస్ కోర్టులు, క్రికెట్ గ్రౌండ్‌కు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు, బ్యాడ్మింటన్‌కు ఉడన్ కోర్టు, బాస్కెట్ బాల్ కోర్టు, దానికి ఫ్లడ్ లైట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశీలనకు విచ్చేసిన వారిలో సైట్ ఇంజినీర్ ఫిరోజ్, డీఎస్‌డీఓ బాలాజి, కేవీకే కోచ్ బాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.



నాడు

టీడీపీ హయాంలో పల్లె వైద్యం మంచం పట్టింది. అప్పట్లో పీహెచ్‌సీలు ఉదయం 11 గంటలకు తలుపులు తెరుచుకునేవి. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకే తాళాలు పడేవి. డాక్టర్లు అప్పుడప్పుడూ చుట్టపుచూపుగా వచ్చి వెళ్లేవారు. సొంత వైద్యానికి సమయం కేటాయించేవారు. స్టాఫ్ నర్సులే ప్రాథమిక చికిత్స చేసి రోగులను పంపించేసేవారు. మందు బిళ్లలూ కరువే. సిబ్బంది కొరత వేధించేది. పురుడు పోసే దిక్కులేక గర్భిణుల ప్రాణాలు గాల్లో దీపంలా కొట్టుమిట్టాడేవి. రాత్రి పూట వైద్యం నామమాత్రమే.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైద్యరంగంపై దృష్టి సారించింది. సమస్యలు ఒక్కొక్కటీ పరిష్కరిస్తోంది. ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టింది. మందులు, వైద్యపరికరాలకు కొరతలేకుండా నిధులు కేటాయించింది. కొత్త భవనాలకు తోడు.. అవసరం మేరకు డాక్టర్లను నియమించింది. మాతృమరణాల కట్టడికి పెద్దపీట వేసింది. పల్లె ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 24 గంటలూ పనిచేసేలా ఆదేశాలు జారీ చేసింది. సిబ్బంది గైర్హాజరు కాకుండా డ్యూటీ చార్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తోంది.



ప్రాణాలు రక్షిస్తూ... వసతులకు పురుడు పోస్తూ!





చిత్తూరు జిల్లా గంగవరం మండలం పత్తికొండ పీహెచ్‌సీలో తల్లిబిడ్డతో సిబ్బంది, తిరుపతి జిల్లా పాపానాయుడు పేటలో గర్భిణీని పరిశీలిస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇందులో గత నెలాఖరు వరకు 41 మాత్రమే 24 గంటలు పనిచేసేవి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 24 గంటలూ పనిచేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. సిబ్బంది ఎల్లవేళలా రోగులకు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. గర్భిణులు రాత్రి పూట వచ్చినా పురుడు పోసేలా సిబ్బందిని నియమించారు. అవసరమైన మందులతోపాటు అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చారు .

ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఇలా..

ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు సూపర్ వైజర్లు (వీరు ఏఎస్‌ఎంలకు, వైద్యశాలకు మధ్య సంధానకర్తలు) ఉంటారు. ఎంఎన్‌ఓ లేదా ఎఫ్ఎన్‌ఓ, మేల్, ఫిమేల్ అసిస్టెంటు, జూనియర్ అసిస్టెంటు ఉంటారు. వీరందరినీ ఇప్పటికే సర్దుబాటు చేయడం ప్రారంభించారు.

విజయవంతంగా ఫ్యామిలీ ఫిజిషియన్

ఇప్పటికే ప్రభుత్వం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. దీనికోసం ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది ఉండేలా నియామకాలు చేపట్టారు. వైద్యుడు వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యం అందిస్తే.. మరో వైద్యుడు 104 ద్వారా గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు వెళ్లి ఉదయం నుంచి ఓపీ చూడడం, ఆ తర్వాత ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి సేవలందించేలా ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మరో వైద్యుడు మాత్రం పీహెచ్‌సీలో వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా సర్దుబాటు చేశారు.



చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చిత్తూరు జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఓపీ, ప్రసవాలు

నెల	ఓపీల సంఖ్య	ప్రసవాల సంఖ్య
మే	95,279	22
జూన్	1,03,993	31
జూలై	1,00,480	26
ఆగస్టు	1,01,728	70

తిరుపతి జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఓపీ, ప్రసవాలు

నెల	ఓపీల సంఖ్య	ప్రసవాల సంఖ్య
మే	155608	39
జూన్	185348	41
జూలై	154702	51
ఆగస్టు	126673	47

పీహెచ్‌సీల్లో తనిఖీ

ప్రభుత్వ ఆదేశాల మేరకు పీహెచ్‌సీలపై రెండు జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టిసారించారు. బుధవారం చిత్తూరు జిల్లా గుడిపాల పీహెచ్‌సీని, అలాగే తిరుపతి జిల్లాలోని పాపానాయుడుపేట, వడమాలపేట పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ప్రసవ కేసులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు.



తిరుపతి జిల్లా పాపానాయుడు పీహెచ్‌సీలో ప్రసవించిన బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి



చిత్తూరు జిల్లా గుడిపాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జన్మించిన బిడ్డను రాత్రి పూట పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

24 గంటలు పనిచేయాల్సిందే

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇకపై 24 గంటలు పనిచేస్తాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సిబ్బంది కచ్చితంగా పనిచేయాలి. కేంద్రంలో సిబ్బంది లేరని ఫిర్యాదు వస్తే.. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ప్రతి పీహెచ్‌సీలోనూ ఇద్దరు వైద్యాధికారులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, తొమ్మిది మంది ఇతర సిబ్బంది ఉండేలా చర్యలు చేపడుతున్నాం. స్టాఫ్ నర్సులు షిఫ్ట్ వారీగా సేవలందిస్తారు. వారు సెలవు పెట్టినప్పుడు సమస్య లేకుండా మూడో షిఫ్ట్ కోసం సీనియర్ స్టాఫ్ నర్సును నియమించనున్నాం.

–డాక్టర్ ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

విధులకు వెళ్లాల్సిందే

పీహెచ్‌సీలు ఇకపై 24 గంటలు పనిచేస్తాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సిబ్బంది విధులకు వెళ్లాల్సిందే. నిరంతరం పల్లె ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించాలి. ముఖ్యంగా ప్రసవాల సంఖ్య పెంచాలి. హైరిస్క్ కేసులను మాత్రమే జిల్లా, ఏరియా ఆస్పత్రులకు పంపించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలి. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయి. రాత్రి పూట విధిగా విధుల్లో ఉండాల్సిందే. డ్యూటీ చార్ట్‌ను పాటించాలి. మాతా శిశుమరణాలను కట్టడి చేయాలి.

–డాక్టర్ శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

చిరస్మరణీయులు సుబ్రమణ్యశాస్త్రి





సాధు సుబ్రమణ్య శాస్త్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీటీడీ చైర్మన్

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి స్వామి వారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన చిరస్మరణీయులు సాధు సుబ్రమణ్యశాస్త్రి అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఆదివారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాధు సుబ్రమణ్య శాస్త్రి 42వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భూమన మాట్లాడుతూ టీటీడీలో చిన్న స్థాయి ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభించి వెయ్యికి పైగా శాసనాలను వెలికితీసి పరిష్కరించిన గొప్ప వ్యక్తి సుబ్రమణ్యశాస్త్రి అని వెల్లడించారు. అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో 12 వేల సంకీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో అధిక భాగం సంకీర్తలను శాస్త్రి పరిష్కరించి సమాజానికి అందించారని వివరించారు. అలాంటి మహనీయునితో పాఠశాలలో చదివే రోజుల్లోనే పరిచయం కావడం తన అదృష్టమని తెలిపారు. శ్రీవారికి అమూల్యమైన సేవలందించిన సాధు సుబ్రమణ్య శాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లె అనంత కృష్ణ శర్మ విగ్రహాలు ప్రతిష్ఠించాలనే ఆలోచన శ్రీవేంకటేశ్వరస్వామివారే తనకు కల్పించారన్నారు. అలాంటి మహానుభావుల జీవితాలను విద్యార్థులు తప్పని సరిగా తెలుసుకోవాలని పిలుపు నిచ్చారు. సాధు సుబ్రమణ్యశాస్త్రి వెలికి తీసి పరిష్కరించిన శాసనాల పుస్తకాలను పిల్లలు, పెద్దలు కూడా చదవాలని కోరారు.అనంతరం ఆచార్య రామసూర్యనారాయణ మాట్లాడుతూ సుబ్రమణ్య శాస్త్రి సేవలను కొనియాడారు. కార్యక్రమానికి ముందు శ్వేత భవనం ఎదుట ఉన్న సుబ్రమణ్యశాస్త్రి విగ్రహానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పుష్పాంజలి ఘటించారు.

గౌరి పెద్ది రామసుబ్బశర్మ విగ్రహావిష్కరణ

ఎస్వీ ఓరియంటల్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గౌరి పెద్ది రామసుబ్బ శర్మ విగ్రహాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ సదా భార్గవి, శాస్త్రి కుమార్తె గిరిజ, మనుమడు, జడ్జి మూర్తి, శ్వేత సంచాలకులు ప్రశాంతి, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

కాణిపాకంలో అద్దాల మండపం ప్రారంభం

- శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు
- అనుబంధ ఆలయాల్లో నూతన హోమగుండాలకు పూజలు



అద్దాల మండపంలో కొలువుదీరిన సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రధాన ఆలయంలో రూ.కోటి విరాళంతో నిర్మించిన అద్దాల మండపాన్ని ఆదివారం సంప్రోక్షణ పూజల అనంతరం ప్రారంభించారు. అలాగే కొత్తగా రాగి రేకులు తొడిగిన ప్రధాన ఆలయ ధ్వజస్తంభానికి, దేవస్థానం అనుబంధ శ్రీమణికంఠేశ్వర ఆలయం, శ్రీవరదరాజుల స్వామి ఆలయాలల్లో నూతనంగా ఏర్పాటు చేసిన హోమ గుండాలకు సంప్రోక్షణ పూజలు చేసి ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన దాత ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ అధినేత మహేష్‌కుమార్‌రెడ్డి అద్దాల మండపం నిర్మాణానికి రూ.కోటి విరాళం ఇచ్చారు. అర్చక వేదపండితులు కలశ పూజలు, అద్దాల మండపంలో కొలువు తీర్చే శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి విగ్రహలకు ప్రత్యేక అభిషేకాలు, హోమ పూజలు నిర్వహించారు. తదుపరి దేవదేవరులను సర్వాంగ సుందరంగా అలంకరించి అద్దాల మండపంలో కొలువుదీర్చి పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ధ్వజస్తంభానికి సంప్రోక్షణ చేసి పూజలు చేసి, బాలాలయాన్ని తొలగించారు. నూతనంగా నిర్మించిన షోడశ గణపతి ఆలయంలో 16 అవతారాల స్వామివారి విగ్రహలను కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి నిధులను విరాళంగా అందించిన దాత కుటుంబ సభ్యులకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు శేషవస్త్రాలు, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ ఈఈ వెంటకనారాయణ, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్‌లు కొండదపాణి, వాసు, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.



కాణిపాకం ఆలయంలో హోమ పూజలు చేస్తున్న అర్చకులు, వేద పండితులు

రామబంటూ..నీవే శరణమంటూ





పోకుమాను బరుకు కార్యక్రమంలో అశేష భక్తులు, ప్రత్యేకాలంకరణలో శ్రీవీరాంజనేయస్వామి

చౌడేపల్లి: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ శ్రీవీరాంజనేయస్వామి ఆలయ తిరుణాళ్ల ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తసంద్రంగా మారాయి. జై హనుమాన్ నామస్మరణలు మార్మోగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తొలుత రాజనాలబండకు సమీపంలోని కొత్తగూబలవారిపల్లె , దాసరయ్యగారిపల్లె, పెద్దూరు, ఉటూరు గ్రామాలకు చెందిన దేవరెడ్డులతో గ్రామపెద్దలు మేళతాళాల నడుమ రాజనాలబండకు చేరుకొన్నారు. కొలింపల్లె గ్రామం నుంచి బోయకొండ గంగమ్మ అమ్మవారి ఉత్సవమూర్తితో కలసి ఊరేగింపుగా కోలాటలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవులతో చేరుకుని సంప్రదాయకంగా బండారు పంపకం చేశారు. అక్కడి నుంచి దేవరెడ్డులు, బోయకొండ అమ్మవారిని మేళతాళాల నడుమ ఊరేగింపుగా రాజనాలబండకు వేంచేపు చేశారు. మండలంనుంచే కాకుండా వివిధ గ్రామాలనుంచి వేలాది మంది భక్తులు రాజనాలబండకు చేరుకొనడంతో కిటకిటలాడింది. భక్తిశ్రద్ధలతో శ్రీవీరాంజ నేయస్వామికి పూజలు చేశారు. ఉట్లోత్సవం, పోకుమాను బరుగుట తదితర కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి. సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేశారు. భక్తులకు అవసరమైన సదుపాయాలను తిరుణాల నిర్వాహక కమిటీ సభ్యులు, ఆర్‌బీ యూత్ సభ్యులు, తదితరులు ఏర్పాట్లుచేశారు. స్వామివారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి దర్శించుకున్నారు.

జిల్లా యువజనోత్సవ పోటీలకు 13 లోపు పేర్ల నమోదు

తిరుపతి కల్చరల్ : జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలకు యువ కళాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు అర్హత సాధిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న వివిధ సాంస్కృతిక పోటీలకు 15 నుంచి 29 ఏళ్ల లోపు యువతీయువకులు అర్హులని వివరించారు. గతంలో విజేతలుగా నిలిచిన వారు ఈ పోటీలకు అనర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి గలవారు ఈనెల 13వ తేదీలోపు పేరు, పుట్టిన తేదీతోపాటు పోటీలో పాల్గొనే అంశాలను వాట్సాప్, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. లేదా తిరుపతి సెట్విన్ కార్యాలయంలో వివరాలను అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 0877–2286921, 9440573537, 7036428762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వడ్డెర సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం

చిత్తూరు రూరల్: చిత్తూరు గిరింపేట గాయత్రీ నగర్‌లో ఆదివారం వడ్డెర సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డీవీఎస్ మణిని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వల్లపు వరప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెడ్డెప్ప, కోశాధికారిగా గుర్రప్ప వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రగిరి చక్రవర్తి, జిల్లా అధికార ప్రతినిధిగా మునెప్ప, యువత అధ్యక్షుడు చిరంజీవి, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లపు కృష్ణారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్ల కుప్పం శేఖర్, జిల్లా డైరెక్టర్లు మొగిలేశ్వర్, మనోరన్న, పెద్దన్న పాల్గొన్నారు.



కార్యాలయ ప్రారంభోత్సవంలో వడ్డెర సంఘం కార్యవర్గం


HAPPY BIRTHDAY
Happy Birthday
Happy BIRTHDAY
Sri P.V. MITHUN REDDY Garu
Loksabha YSRCP Floor Leader & Loksabha Panel Speaker
MP, Rajampet.
నిత్యం ప్రజలతో మమేకమవుతూ... ప్రజల సేవకే తొలి ప్రాధాన్యమిస్తూ...
ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ... ప్రజల భవితకు భావి నిర్దేశకుడిగా అడుగులు వేస్తున్న...
శ్రీ పి.వి. మిథున్ రెడ్డి గారికి మా హార్థిక జన్మదిన శుభాకాంక్షలు.
ఆకేపాటి విక్రమ్ రెడ్డి
ఎంప్రడా
మైన్స్ అండ్ మినరల్స్
రాజంపేట, రైల్వే కోడూరు, అన్నమయ్య జిల్లా.